# జబ్బు

— ఆర్.ఎస్. హైమవతి



అది మంచి ఎండాకాలం. రోహిణికార్తి. వేడి గాలులు వీస్తున్నాయి. అన్ని తలుపులూ వేసుకుని వంకా వేసుకున్నా గాలి వేడిగానే తగుల్తోంది. కాసేపు పుస్తకం చదువుతూ నడుం వాల్చాను.

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. ఎదురింటి అమ్మాయి. కమల మొహంలో ఆవేదన, ఆత్రుత కనబడుతున్నాయి.

"ఆంటీ! మా అక్కయ్యకి సీరియస్‌గా వుంది ఆంటీ! మాట్లాడడం లేదు. మీరు ఒక్కసారి అర్జెంటుగా రండి ఆంటీ!"

"ఏమ్మా? ఇంట్లో ఎవరూ లేరా?" అన్నాను నేను కూడా కంగారుపడుతూ.

"ఉన్నారాంటీ! ఇవాళ మా తాతగారి తద్దినం. మా అక్క బైటుంది. అందుకని ఇంట్లోకి రాకూడదట. బైట కారు షెడ్‌లో కూర్చుంది. పురోహితులు ఇప్పుడిప్పుడే వచ్చి స్నానాలు చేసి మంత్రాలు చదవడం ప్రారంభించారు. ఆ తతంగం, వాళ్ళ భోజనాలయ్యేసరికి ఇంకోగంట పైనే పడుతుంది. తర్వాత మా నాన్నగారు ఆ పిండాలు నదిలో కలిపి వచ్చి అప్పుడు భోజనం చేస్తారు. తర్వాత అమ్మ, బామ్మ భోజనం చేస్తారు. ఆ తర్వాతగానీ అక్కకి భోజనం పెట్టకూడదట. అంతేకాదు. అంతవరకూ అక్కని చూడరు."

"బాగుంది. అయితే అక్కకి ఉదయాన్నయినా భోజనం పెట్టారా?"

"లేదాంటీ! బైటున్నప్పుడు మూడుసార్లు భోజనం చెయ్యకూడదు కదా! అందుకని ఏం పెట్టలేదు. నేనే పొద్దున్న హొటల్‌నించి రెండు ఇడ్లీలు తెచ్చిపెట్టాను. ఇప్పుడు ఒంటిగంటయింది. అక్కకి చెమటలు పట్టేస్తున్నాయి. కడుపు నొప్పితో మెలికలు తిరిగిపోతోంది. రెండుసార్లు వాంతులు చేసుకుంది. ఈ సంగతి అమ్మావాళ్ళతో చెప్తే "అదే తగ్గిపోతుందిలే" అన్నారు. అక్కకి ఎప్పుడూ బైటున్నప్పుడు నెప్పిరాదు. నాకేం చెయ్యాలో తోచక మీ దగ్గిరకొచ్చాను" అంది గాభరాపడుతూ.

ఇంతకి తాళం పెట్టి నేనూ ఆత్రుతగా పరుగెత్తాను. బైట కారుషెడ్‌లో అచేతనంగా పడివున్న జానకి ముఖంమీద కాసిని చన్నీళ్ళు జల్లాను. కళ్ళుతెరచి చూసింది. కాస్త మజ్జిగ తాగించాను. కమలని రిక్షా పిల్చుకురమ్మని పంపాను. రిక్షా రాగానే నేను ఆమెని లేవబోయాను. ఏమాత్రం శక్తిలేని జానకి లేవలేకపోయింది. కమలని కూడా పట్టుకోమన్నాను.

"అయ్యో! నే పట్టుకుంటే ఎలా ఆంటీ? మా వాళ్ళు నన్ను ఇంట్లోకి రానివ్వరు" అంది.

"పోనీలే మా ఇంట్లో వుందువుగాని. పిచ్చివేషాలెయ్యక పట్టుకో!" కసిరాను. పట్టుకుంది. ఇద్దరం కలిసి రిక్షాలో డాక్టరు దగ్గిరకి తీసుకెళ్ళాం. ఆయన నాకు తెలిసిన డాక్టరు కావడంవల్ల వెంటనే ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. సెలైన్ ఎక్కించారు.

"అసలే కొంచెం వీక్ అనుకుంటాను. గాడ్పుకొట్టింది. సమయానికి తీసుకొచ్చారు. లేకపోతే చాలా ప్రమాదం జరిగేది" అన్నారు డాక్టరు. కొన్ని మాత్రలు, టానిక్కూ రాసి ఇచ్చారు. సాయంకాలం ఎండ చల్లబడ్డాక మా ఇంటికి తీసుకొచ్చాను.

* * *

సాయంకాలం వాళ్ళ నాన్నగారు విశ్వనాధరావు వచ్చారు. "మీరు సమయానికి ఆదుకున్నారు. అయినా బైటున్న పిల్లని ఎలా ముట్టుకుని తీసుకెళ్ళారండీ? మా ఇంట్లో తద్దినం. ఒక ఇంట్లో ఎలా కూర్చోపెడతాం? చెప్పండి" అన్నాడాయన.

"ఏమిటండీ? చదువుకున్న మీరు కూడా పూర్వకాలపు చాదస్తపు మనుమల్లాగా మాట్లాడతారు. ప్రకృతిసిద్ధంగా వచ్చే ఋతుస్రావానికి అదేదో మహాపాపమన్నట్టు వాళ్ళని చూడకూడదని, ముట్టుకోకూడదని, ఇంట్లోనే వుండకూడదనీ—ఏమిటీ ఆంక్షలు? అయినా నాకు తెలియక అడుగుతాను—మీరు నదికివెళ్తున్నప్పుడు దార్లో అందరూ కూడా మీలా మడిగట్టుకున్నవారే వెళ్తున్నారా? అయినా ఎప్పుడో చచ్చినవాళ్ళకి మడి లోపమవుతుందని బతికున్నవాళ్ళని చంపుకుంటారా?" అన్నాను.

"ఏం చెయ్యమంటారండీ? తాత ముత్తాతల నించీ వస్తున్న ఆచారాలని వదులుకోలేకుండా వున్నాం. అందులో మా అమ్మగారు పెద్దవారు వున్నారు కదా! ఆవిడ మాట ఎలా కాదనగలం చెప్పండి?" అన్నాడాయన.

"మీలాంటి వారికి ఎవరూ చెప్పినా ప్రయోజనం లేదు. కనీసం మరోసారి ఎప్పుడైనా ఇటువంటి పరిస్థితి వస్తే అమ్మాయిని ముందే మా ఇంటికి పంపండి" అన్నాను చేసేదిలేక. ఏ జబ్బు నైనా నయం చెయ్యవచ్చుగాని, ఎయిడ్స్‌కన్నా ఘోరమైన మూఢనమ్మకం జబ్బు నయం చెయ్యలేం మరి!